క్లుప్తంగా

స్వర్ణ, రజత పుష్పాలతో మరిడమ్మకు పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేస్తున్న ఆలయ పండితులు

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: మండల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. చంద్రంపాలెం-1, జి.మేడపాడు-1, పీబీ దేవం-1, ఉండూరు-1, వేట్లపాలెం-1 వలంటీరు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి అర్హత కలిగి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్వచ్ఛత పురస్కారాలకు..

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళల నుంచి ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత 2023 అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్త వినియోగం వంటి విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు అవార్డులకు అర్హులన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 22వ తేదీ లోపు నగర పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఎంపికైన మహిళలకు జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ వేడుకల్లో అవార్డులు అందజేస్తారన్నారు.

పుంగనూరు జాతి ఆవు దూడ జననం



పుంగనూరు జాతి ఆవుదూడ

పిఠాపురం: స్థానిక సీతయ్యగారితోటకు చెందిన పాడి రైతు ద్విభాష్యం కుమార సుబ్రహ్మణ్య శర్మకు చెందిన ఆవు శుక్రవారం పుంగనూరు జాతి దూడకు జన్మనిచ్చింది. దూడ 15 అంగుళాల ఎత్తు మాత్రమే ఉందని, పూర్తి ఆరోగ్యంగా ఉందని రైతు సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం



అమరవల్లిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

కొత్తపల్లి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తోందని ఎంపీడీఓ భాస్కరరావు అన్నారు. మండలంలోని అమరవల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లోనూ సంపద కేంద్రాల నిర్వహణ మరింత మెరుగుపడాలన్నారు. సంపద కేంద్రాల్లో తయారు చేసిన కంపోస్ట్ ఎరువును రైతులకు తక్కువ ధరకు విక్రయించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తపల్లి: మండలంలోని యండపల్లి శివారు జోన్నలగరువుకు చెందిన బత్తిన రజనీ కుమారి గేదెల పాక ఇటీవల ప్రమాదవశాత్తూ కాలిపోయింది. కాగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వర్మ పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, రవి, కాశిబాబు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ మూణ్నాళ్ల ముచ్చటే!



సామర్లకోట పోలీసు స్టేషన్

- నిరుపయోగంగా రిసెప్షన్ సెంటర్
- బూజు పట్టి శిథిలావస్థకు చేరిన భవనం
- వినియోగంలోకి తేవాలని పలువురి విన్నపం



నిరుపయోగంగా ఉన్న రిసెప్షన్ సెంటర్

సామర్లకోట: ఆరంభ శూరత్వం దాదాపు ప్రతి విభాగంలోనూ కనిపిస్తుంది. ఇదిగో స్థానిక పోలీసు స్టేషన్‌లో 2018లో నిర్మించిన రిసెప్షన్ సెంటర్ నిర్మాణం అలాంటిదే. పలు వివాదాలతో వచ్చేవారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేందుకు దీనిని నిర్మించి ఎస్సైతో పాటు, ఏఎస్సై, హెచ్‌సీ ఉండేవారు. పాత స్టేషన్‌లో మిగిలిన సిబ్బంది విధుల నిర్వహణకు, నిందితులను ఉంచేందుకు వినియోగించేవారు. ఏమైందో ఏమో ఏవో వాస్తు నమ్మకాలతో ఆ రిసెప్షన్ కౌంటర్‌ను ఖాళీ చేసేశారు. ఐదేళ్లుగా ఈ భవనం నిరుపయోగంగా మారి బూజు పట్టి పాడవుతోంది. ఈ స్టేషన్ సమీపంలోనే ఉన్న పోలీసు క్వార్టర్లదీ అదే పరిస్థితి. వాస్తుపై నమ్మకం ఉంటే సరిచేసి వినియోగంలోకి తెస్తే సరిపోయేది. ఈ కౌంటర్ ఆవరణలో పట్టుబడిన, సీజ్ చేసిన వాహనాలను ఉంచుతున్నారు. అవి ఎండకు ఎండి వానకు తడిసి పాడైపోతున్నాయి.

స్థాయి మారినా స్టేషన్‌లో మార్పు రాదా!

సామర్లకోట పోలీసు స్టేషన్ సర్కిల్ స్థాయికి పెరిగింది. దాంతో ఒక సీఐతో పాటు ముగ్గురు ఎస్సైలను నియమించారు. ముగ్గురు ఏఎస్సైలు కూడా ఉన్నారు. అయినప్పటికీ స్టేషన్‌లో మార్పు రాలేదు. గతంలో నిందితులను ఉంచే హాల్‌ను శుభ్రంచేసి అందులో సీఐ విధులు నిర్వర్తిస్తున్నారు. వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాలు ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోను, పనసపాడు, అచ్చంపేట, గొంచాల, నవర, పవర గ్రామాలు తిమ్మాపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నాయి. మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని పీబీ దేవం, జి. మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, కాపవరం, చంద్రంపాలెం, పండ్రవాడ గ్రామాలు సామర్లకోట స్టేషన్ పరిధిలోనికి వస్తాయి. దాంతో పట్టణానికి, మండలానికి ఒకే పోలీసు స్టేషన్‌గా ఉన్నా అదనపు భవనాన్ని ఉపయోగించక పోవడంతో సర్వత్రా విమర్శలు ఉన్నాయి.

రిసెప్షన్ సెంటర్ వినియోగంలోనికి తేవాలి



పోలీసు స్టేషన్ ఆవరణలో ఉన్న రిసెప్షన్ సెంటర్‌ను వినియోగంలోనికి తీసుకు రావాలి. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారికి కౌన్సెలింగ్ చేయడానికి రిసెప్షన్ సెంటర్ అనువుగా ఉంటుంది.

– శెట్టిబత్తుల దుర్గారావు, వైఎస్సార్ సీపీ కోశాధికారి, సామర్లకోట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం



గతం నుంచి రిసెప్షన్ సెంటర్ మూసి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి వినియోగంలోకి తీసుకువస్తాం. పోలీసుకు వాస్తుతో పని లేదు. పోలీసు క్వార్టర్స్ గతంలోనే శిథిలమైనా, నివాస యోగ్యంగా లేవు.

– కె దుర్గాప్రసాద్, సీఐ, సామర్లకోట

సుస్థిర స్థానమే లక్ష్యంగా పాలన

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి
- మాధవపట్నంలో గడప గడపకూ



మాధవపట్నంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: రాష్ట్ర ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకునేలా సీఎం జగన్ పాలన సాగుతోందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం మాధపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించి మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి అజెండాగా పాలన సాగుతుందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంతో ఆయనకు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. రాష్ట్రంలోని 175 స్థానాలలోను ఒంటరిగా పోటీ చేసే దమ్మున్న నాయకుడు జగన్ ఒక్కరే అని తెలిపారు. అర్హత ఉండి పథకాలు అందక పోతే అధికారులతో సమన్వయం చేసుకుని వారికి న్యాయం చేస్తామని తెలిపారు. దీనిలో భాగంగా సీఎం జగన్ ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇవ్వాలని కోరుతున్నట్టు తెలిపారు. గ్రామంలో ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణకు ఆనందంగా ఉందని తెలిపారు. గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల కృష్ణార్జున రావు, తోలెం లోవరాజు, ఎంపీడీఓ డి శ్రీలలిత, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు. అంతకు ముందు దొరబాబు జలజీవన్ మిషన్ పథకంలో బోరుకు శంకుస్థాపన చేశారు.

లాభాల్లో అచ్చంపేట సొసైటీ



సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న వీరంరెడ్డి నాని

సామర్లకోట: మండల పరిధిలోని అచ్చంపేట సొసైటీ రూ.17.99 లక్షల లాభంతో నడుస్తుందని సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన అధ్యక్షతన సొసైటీ సర్వ సభ్య సమావేశం జరిగింది. సొసైటీలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతుకు సొసైటీ నుంచి రుణాలు అందజేయనున్నామని, సభ్యులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని అన్నారు. సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.1.82 కోట్లు, సొసైటీ షేర్ క్యాపిటల్ రూ.81.90 లక్షలు, సభ్యుల నుంచి రావలసిన రుణ బకాయిలు రూ.12.73 కోట్లు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ జి. వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు పి.వీరప్రభాకరరావు, వి.లచ్చారావు, సొసైటీ సిబ్బంది జి.అప్పారావు, ఏఎస్‌పీ కుమార్, మండల పరిషత్ రెండో వైస్ ప్రెసిడెంట్ పేర్నీడి వెంకటరాయుడు, గొంచాల ఉపాధ్యక్షుడు ముమ్మిడి శివశంకర వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డ్వామా అధికారుల శిక్షణ



శిక్షణ పొందుతున్న ఏపీడీ, ఏపీఓ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో తొమ్మిది జిల్లాలకు చెందిన డ్వామా అధికారులకు ఇస్తున్న శిక్షణ రెండో రోజు కొనసాగింది. ఉపాధి హామీ పథకంలో నాణ్యత పెరిగేలా పనులు చేయడం, గ్రామానికి ఉపయోగపడే పనులను గుర్తించడం వంటి అంశాలపై శిక్షణ కో ఆర్డినేటర్, డ్వామా ఏపీడీ రమేష్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఏపీడీ, ఏపీఓ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు 56 మంది పాల్గొన్నారు. శనివారంతో శిక్షణ ముగియనుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రాత పరీక్ష ఉంటుందని, అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు.

ధర్మ సంస్థాపనకే దశావతారాలు



అధ్యాత్మిక ప్రవచనంలో పాల్గొన్న మహిళలు

ఏలేశ్వరం: ధర్మ సంస్థాపన కోసమే విష్ణుమూర్తి దశావతారాలు ఎత్తారని శ్రీమాన్ చినజీయర్‌స్వామి శిష్యురాలు వాగు రోహిణి అన్నారు. స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విష్ణుమూర్తి దశావతారాలపై ఆమె ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అన్నియుగాల్లోనూ ధర్మ సంస్థాపన కోసమే విష్ణుమూర్తి పలు అవతారాలు ఎత్తారన్నారు. రామునిగా మానవజన్మ ఎత్తి ధర్మాన్ని కాపాడారని తెలిపారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని ఆధ్వర్యంలో పారాయణాలు పఠనం చేశారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, సంఘ మహిళా సభ్యులు పాబోలు దేవి, మల్లేశ్వరి, కల్యాణి, ఇందిరాప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు



మల్లేపల్లి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న సీఎంఓ నాగేశ్వరరావు

గండేపల్లి: మండలంలోని పలు పాఠశాలలతో పాటు మల్లేపల్లిలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం కాకినాడ సమగ్ర శిక్షా సీఎంఓ, జిల్లా సహిత విద్య సమన్వయ కర్త చామంతి నాగేశ్వరరావు తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలతో మాట్లాడి విద్యాప్రమాణాలు, ప్రగతిని అంచనా వేశారు. తొలుత గండేపల్లి, మల్లేపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. రికార్డులు, స్కూల్స్ రిజిస్టర్స్, క్లాస్ రూమ్స్‌లో విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం జి.సుధామాధురి, సీఆర్పీ తాతబాబు, ఐఈఆర్‌పీఎస్ లోవ, ప్రకాశరావు తదితరులు ఉన్నారు.

పన్ను బకాయిలకు వడ్డీ మాఫీ

మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్

పిఠాపురం: పురపాలక సంఘం పరిధిలో ఇంటి పన్నులపై విధించిన అపరాధ రుసుము (పెనాల్టీ వడ్డీ) ని పూర్తిగా మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ శుక్రవారం తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో భవనాలు, ఖాళీ స్థలాలపై ప్రాపర్టీ ట్యాక్స్, ఇంటి పన్నులపై నెలకు 2 శాతం చొప్పున విధిస్తున్న పెనాల్టీలను మాఫీ చేస్తూ జీఓ ఎంఎస్ నంబర్ 34ను విడుదల చేసిందని చెప్పారు. గడిచిన ఏడాది కాలం నుంచి భవనాలు, ఖాళీ జాగాలపై ప్రాపర్టీ ట్యాక్స్ ఇంటి పన్నులపై 31 మార్చి వరకూ పేరుకు పోయిన బకాయిలు వన్‌టైం సెటిల్‌మెంట్ పద్ధతిలో ఈ నెల 31 లోపు చెల్లిస్తే వడ్డీ రాయితీ పొందవచ్చన్నారు. వీటితో పాటు వాటర్ ట్యాక్స్ బకాయిలు ఇదే పద్ధతిలో చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పన్ను రాయితీని వినియోగించుకోండి

పిఠాపురం: గొల్లప్రోలు నగర పరిధిలో ఇంటి పన్నులపై విధిస్తున్న అపరాధ రుసుమును పూర్తిగా మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. ప్రజలు ఇంటి పన్నులు, భవనాలు, ఖాళీ జాగాలపై ప్రాపర్టీ ట్యాక్స్‌ను ఈ నెల 31లోగా వన్ టైం సెటిల్‌మెంట్ పద్ధతిలో చెల్లించి రాయితీ పొందాలని సూచించారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులు నాణ్యంగా ఉండాలి

మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్



రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సాయి ప్రసాద్

పెద్దాపురం: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని మున్సిపల్ అధికారులను మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆదేశించారు. స్థానిక 1, 29వ వార్డుల్లోని పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మౌలిక వసతుల కల్పన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం వార్డుల్లో జరుగుతున్న ఆదిత్య స్కూల్ రోడ్డు నిర్మాణ పనులు, డ్రైన్లు, రోడ్ల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్లు ఆరెళ్ళి వీర్రాఘవులు, విడదాసరి రాజా, కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన



పిఠాపురం ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పిఠాపురం: కేంద్ర ప్రభుత్వం అదానీకి తొత్తుగా మారిందని, ప్రభుత్వ ఆస్తులను అదానీకి కట్టబెడుతోందని సీపీఎం జిల్లా నాయకుడు దువ్వా శేషుబాబ్జీ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం, అదానీపై తయారు చేసిన పుస్తకాన్ని శుక్రవారం పిఠాపురంలో సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అదానీకి కట్టబెడుతున్న ప్రజల ఆస్తులను కాపాడేందుకు ఈ నెల 21 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోనేటి రాజు, కె. చిన్న, కె.విశ్వనాథం, నాగేశ్వరరావు, జి.వీరబాబు, కె.మణి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు.

ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు. వేద పండితులు హనుమంతువజ్జల అవధాని, కంచిభట్ల రామ్‌కుమార్, దత్తాత్రేయ శర్మ, చిట్టిం వాసు, కొంపెల్ల సత్యనారాయణ మూర్తి, కూచుమంచి ప్రసాద్ హోమం జరిపారు. 15 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కొండ దిగువన తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

హాస్టల్ విద్యార్థిని మృతి

కాకినాడ సిటీ: స్థానిక జగన్నాథపురం సాంఘిక సంక్షేమశాఖ బాలికల హాస్టల్ విద్యార్థిని పులిదిండి మణికుమారి గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతికి హాస్టల్ వార్డెన్ కారణమని, వారిని సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు, దళితసంఘాల ప్రతినిధులు శుక్రవారం రాత్రి హాస్టల్ వద్ద ఆందోళనకు దిగారు. రామచంద్రపురం మండలం హసనబాదకు చెందిన మణికుమారికి ఈనెల 13న వాంతులు కావడంతో వార్డెన్ ట్యాబ్లెట్ ఇచ్చారు. పరీక్షలు రాస్తున్న ఆమెకు మరుసటి రోజు వాంతులు కావడంతో వార్డెన్ జీజీహెచ్‌కు తీసుకువెళ్లి పరీక్షలు చేయించి సమస్య ఏమీ లేదని వైద్యులు చెప్పడంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పంపేశారు. కాగా ఆమె పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. ఆమె మృతికి కారణమైన హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు ఆందోళన చేశాయి.

ఆర్‌ఎంపీ చిట్టికొండకు డాక్టరేట్

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన రిజిష్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ (పీఎంపీ) అందే సత్యనారాయణ (చిట్టికొండ) డాక్టరేట్ పొందారు. దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం సాయంత్రం మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ సామాజిక సేవ, ఆరోగ్య సంరక్షణ సేవల విభాగంలో అందే చిట్టికొండకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ సీపీ యాదవ్, రిజిస్ట్రార్ సుష్మి తాడే, బోనోరిస్ కాసా తదితరులు అందే చిట్టికొండకు డాక్టరేట్‌ను అందజేశారు. గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న అందే చిట్టికొండను గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సలాది కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం తదితరులు అభినందించారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ పూజలు



గొల్లప్రోలులో వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

పిఠాపురం: గొల్లప్రోలు రైల్వే స్టేషన్ వద్ద వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ మొగలి అయ్యారావు, గొల్లపల్లి చిన్న, భక్తుల సహకారంతో నిర్వహిస్తున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. శుక్రవారం ధ్వజస్తంభంపై ఏర్పాటు చేయనున్న శంఖు చక్రాలు, యంత్రాలను గ్రామోత్సవం నిర్వహించగా పలువురు భక్తులు వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠను పురస్కరించుకుని శనివారం మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థిని హాస్టల్ నిర్వాహకులకు అప్పగింత



హాస్టల్ విద్యార్థి వెంకటదుర్గాప్రసాద్‌ను ఉపాధ్యాయునకు అప్పగించిన జీఆర్పీ పోలీసులు

సామర్లకోట: తెనాలి హాస్టల్ నుంచి వెళ్లిపోయి ఇక్కడకు వచ్చిన విద్యార్థి చెవుల వెంకటదుర్గాప్రసాద్ (15)ను జీఆర్పీ పోలీసులు శుక్రవారం తెనాలి హాస్టల్ ఉపాధ్యాయులకు అప్పగించారు. హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు మేరకు స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో దుర్గాప్రసాద్ ఉన్నట్లు తెలుసుకుని జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో గురువారం రాత్రి అతడిని సామర్లకోట జీఆర్పీ స్టేషన్‌కు తీసుకు వచ్చి కౌన్సెలింగ్ చేసి హాస్టల్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం వచ్చిన హాస్టల్ ఉపాధ్యాయుడు ఎంఎస్ చక్రవర్తికి విద్యార్థిని జీఆర్పీ కానిస్టేబుల్ సీహెచ్ గౌరి అప్పగించారు.

బీసీల సంక్షేమానికి పెద్ద పీట



ఆవాల రాజేశ్వరి

సామర్లకోట: రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి సీఎం జగన్ పెద్ద పీట వేస్తున్నారని అయ్యారక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఆవాల రాజేశ్వరి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీల సంక్షేమానికి రూ.38,600 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారని తెలిపారు. అదే విధంగా బలహీన వర్గాల సంక్షేమానికి రూ.80 వేల కోట్లు కేటాయించి, రాజకీయాల్లో స్థిర ప్రాధాన్యం ఇస్తూ బీసీల ఆత్మగౌరవాన్ని సీఎం జగన్ పెంచుతున్నారన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 50 మంది గైర్హాజరు

కిర్లంపూడి: మండలంలోని శుక్రవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లిషు పరీక్షకు 50 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 504 విద్యార్థులకు గాను 479 మంది, జగపతినగరం ప్రగతి జూనియర్ కళాశాలలో 332 విద్యార్థులకు గాను 307 మంది పరీక్షలకు హాజరు కాగా 50 మంది గైర్హాజరైనట్టు డీఓ వర్ధనపు శివప్రసాద్ వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఇంటర్ పరీక్షలకు 18 మంది గైర్హాజరు

ప్రత్తిపాడు: స్థానిక హర్షవర్ధన జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో 408 మంది పరీక్షలకు హాజరుకావల్సి ఉండగా 390 మంది హాజరైనట్లు అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ సీహెచ్ ఆనందకుమార్ జోషి తెలిపారు.

ఏఎంవీఐపై దాడి బాధాకరం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విధి నిర్వహణలో ఉన్న ఏఎంవీఐ చిన్నారావుపై దాడి బాధకరమని అడిషనల్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఏఎస్‌వీ చిన్నారావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ నుంచి వచ్చిన ఆయన కాకినాడ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యునిఫాంలో ఉన్న ఉద్యోగిపై దాడి చేయడం తగదని, రవాణాశాఖ తరపున కేసు వేగవంతంగా పూర్తిచేసేలా కృషిచేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ పరిపాలనలో భాగస్వాములే తప్ప వ్యక్తిగత అజెండాలు ఏవరికీ ఉండవని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తారన్నారు. ప్రశాంతమైన నగరంలో ఇటువంటి సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. రవాణాశాఖ టెక్నికల్ ఉద్యోగులకు విధి నిర్వహణలో ఉన్నప్పుడు బాడీ కెమెరాలు అమర్చడానికి ఉన్నత అధికారులతో చర్చిస్తామన్నారు. రవాణాశాఖ మంత్రి విశ్వరూప్ ప్రత్యేక శ్రద్ధతో ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జేటీసీ సీహెచ్ శ్రీదేవి, ఎంవీఐలు మురళీకృష్ణ, హరినాథరెడ్డి, లక్ష్మీకిరణ్, శ్రీనివాస్, ఏఎంవీఐలు షణ్ముఖ శ్రీనివాస్, యడ్ల సురేష్ పాల్గొన్నారు.